

# పండుటాకు

-ఐతా చంద్రయ్య

"గంగా! నువ్వేమో ముడితె మాసిపోయే మల్లె పూవోలున్నవు. నేనేమో నల్లస రపు గుండ్రాయోలున్న. కాశీపట్నంల కొలువున్న శివుడేమో మనిద్దరికి ముడిపెట్టె" అంటూ చెక్కిలి మీద చిటికేసిన ఈశ్వ రయ్య చిలిపి చేష్టలకు, దోర వయసులో కోర చూపుల గంగమ్మ మనోజలధిలో మురిపాల అలలు ఎగిరిపడిన్నై.

"నీతోని నా మెడల మూడు ముళ్లేయింది గూడా ఆ శివ య్యనే గదా బావా! తనకు పిల్లలు కాలేదని మా అక్క పార్వతి మనకు పెండ్లిజేసె. నువ్వేమో కొంటె బావవు. నేనేమో తుంటరి మరదల్ని. ఇప్పుడు నీకు పెండ్లాన్నైపోతి. ఇంగ మనం ముగ్గురం ఒకటే". ఈశ్వరయ్య ఒడిలో సిగ్గుల మొగ్గల్ని ఏరుకుంటూ గంగమ్మ చెప్పుకుపోతోంది. "నువ్వు డక్కీ... గదే... గా బుడిగ వాయించుకుంట కథ జెప్తుంటే, నేను చతుర్లు చెప్తాంటే చూసినోల్లంతా 'వారెవా! బుడిగ జంగమోల్ల కథంటే బాగోతం కంటే బాగున్నదంటరు. మన ముగ్గురం ఊరు దిరిగి ఇంటికొచ్చినంక అక్కడ వంటింట్లకు వోతది. నేను లేడిపిల్లోలె గంతేసి నిన్ను ముద్దుపెట్టుకుంట".

ఆమె జ్ఞాపకాల వ్యాపకాలు.

అలనాటి అత్యుత్సాహం ఈ నాడు చెంగున ఎగిరించింది. అంతే... గంగమ్మ కూచున్న నులక మంచం అమాంతం విరి గిపోయింది. ఇరవయ్యేళ్ల మిసిమి వయసు మురిపాల మూటలు అరవయ్యేళ్ల వయసులో విప్పుకుని తరిమికొట్టి కింద పడేసిన్నై.

తళ తళ లాడ్తున్న తాటాకుల గుడిసె కిలకిలా నవ్వినట్టని పించింది. ఒళ్లు ఝల్లుమంది.

"వామ్మో!" కాస్సేపు గిలగిల్లాడింది. ఇంకా నయం నడుము విరిగి పోలేదు" గొణుక్కుంది. గుడిసె కప్పును గమ్మత్తుగా చూస్తూ, నేలమీద చేతులానించి లేచి నుంచుంది. విరిగిన మంచాన్ని పక్కకు జరుపుతూంటే ఆయాసం ముంచుకొచ్చింది. దగ్గు... గొంతును గురగుర లాడించింది. "నా తెలివి తెల్లారి నట్టే ఉంది. బయట ఎప్పుడో తెల్లారిపోయింది. ఎందుకో... గా పాత సంగతులు గుర్తుకొచ్చి పరేషాన్ జేస్తున్నై..." కిటికీ లోంచి గుడిసెలోకి చొచ్చుకొస్తున్న లేత సూర్య కిరణాలను ఆశ్చర్యంగా చూస్తూ కాలకృత్యాలు తీర్చుకుంది. రాత్రికి మిగిలిన చద్దన్నం తిని, గోడకొరిగి కూచుంది. మనసు మళ్లీ పాత రోజుల్లోకెళ్లి పోతోంది. గతంలోకి తొంగి చూస్తోంది.

భవిష్యత్తు శూన్యమైన సామాన్య జీవికి గత కాలం జ్ఞాప కాలే కాలక్షేపం. చూపులు శూన్యంలో పరుచుకుంటూ దేని కోసమో వెతుకుతున్నాయి.

... ఆడదానికి మొగుడున్నన్ని రోజులే ముద్దూ ముచ్చట్లు. ఆన్క బతుకంతా అడివేగదా! బుడిగ జంగమంటే ఆ రోజుల్లో బుడిబుడి జంగం కాదు. సాక్షాత్తూ జంగం దేవర... శివావతారము.

ఈశ్వరయ్యంటే ఈశ్వరావతారము.

నిలువుటంగీ, గుండు తలకు పొడగాటి తలపాగా, కాళ్లకు గజ్జెలు, నుదుటి విభూతి రేఖల మధ్య ఎర్రని కుంకుమ బొట్టు... సుప్రభాత సూర్యుడిలా మెరుస్తూంటే అప్పుడే కైలాసంనుండి దిగివచ్చిన జంగం దేవరలాగుండే వాడు. భుజమ్మీది తంబూరాను చేతి వేళ్లకు తొడుకున్న అందెలతో తడుతూ మరో చేతిని విచిత్రంగా తిప్పుతూ కథ చెప్తూ... నటరాజులా కన్పించేవాడు.

పార్వతి, గంగమ్మలు గుమ్మెటలు వాయిస్తూ వంతలు పాడుతూ గొంతులు కలిపేవారు. గంగమ్మ హాస్య పాత్రలో అరమరికలు లేకుండా జీవిస్తూంటే జనాలు విరగబడి నవ్వే వారు. కమ్మగా, నెమ్మదిగా సాగిపోయే బుడిగ జంగం కథా ప్రవాహంలో శివలీలలే కాకుండా దేశింగు రాజు కథ, పల నాటి బాలచంద్రుడు, మైరావణ, భక్త సిరియాళ, భక్త అంబ రీష, దక్షయజ్ఞం లాంటి ఎన్నెన్నో పౌరాణిక, ధార్మిక, వీర గాథా కెరటాలు కదుల్తుండేవి. ఇల్లిల్లు తిరిగినా, వేదిక మీద గంటలపాటు కథా కార్యక్రమం నిర్వహించినా సామా న్యులు, అసామాన్యులనే తేడాలేకుండా అందరూ కళ్లు, చెవులు అప్పగించేవారు. బాలనాగమ్మ, సత్యహరిశ్చంద్ర, సీతమ్మవారి కష్టాలు వింటూ కంట తడిపెట్టేవారు. ఎండ నకా, వాన అనకా, చలిపులికి భయపడకుండా కాయక ష్టంతో జీవిస్తూ రక్తాన్ని చెమటగా మార్చి భూమాత ఒడిలో జిలకరించే శ్రమ జీవులు, భూమిపుత్రులు కథలు విని శ్రమ శక్తిని రెట్టింపు చేసుకునేవారు. మానసికానందం బలవర్ధక ఔషధంగా పంజేసేది.

సామాజికంగా ఉపేక్షితులైన హరిజన, గిరిజన, వెనకబ డిన వర్గాలవారి ఇళ్లల్లో ఎవరైనా చనిపోతే, బుడిగ జంగాలే శాస్త్ర సమ్మతంగా సాగనంపేవారు. శవయాత్రలో ధైర్యంగా శవంముందు నడుస్తూ, శివనామ స్మరణ చేయిస్తూ, గంట వాయిస్తూ మనిషి చివరి మజిలీయైన శ్మశాన వాటిక లేదా బొందలగడ్డ దాకా వెళ్లి అంతిమ సంస్కారాన్ని బాధ్యతా యుతంగా నిర్వహించేవారు. అందుకు బేడ మాత్రమే తీసు కుని విగత జీవులైన వారి ఆత్మశాంతికోసం వారి పేరున పొగిడేవారు. అందుకే బేడ జంగాలన్నారంటారు.

ఈశ్వరయ్య అన్ని పనుల్లోనూ ఆరితేరిన వాడు. శివరాత్రి ఉత్సవాలప్పుడు శివాలయమంతా తానే అయేవాడు. ఆల యాన్ని తన గుండె గుడిగా భావించి అతి జాగ్రత్తగా ఏర్పా ట్లు చేసేవాడు. గుడి గోడల దుమ్ముదులిపి, సున్నం కొట్టించి, రంగులు వేయించి కైలాస పర్వత ములా అలంకరించేవాడు. "అచ్చ రభ, శరభా..." నినాదాలిస్తూ శివా రాధనలో తన్మయత్వం చెందే వాడు. ఒంటినిండా విభూతి రేఖ లతో పరమ శివావతారమై పరవశించేవాడు. ఊరేగింపు సందడిలో జన సందోహం మధ్యన- కాళ్లూ చేతుల్ని రబ్బరు బంతిలా తిప్పుతూ ఉల్లాసంగా, ఉత్సాహంగా దండకాలు వేసేవాడు.

"భజే భద్ర! భద్రాంబికా. ప్రాణనాథా!"తో ప్రారంభించి గొంతు నరాలు గమ్మత్తుగా కదుల్తూంటే "సుర రాతిభంగా! ప్రభో రుద్రా! రౌద్రావతారా! సునాశీర ముఖ్యామకానేక సంభావితా సల్ప సుశ్లోక! చారిత్ర! కోట్యర్క సంకాశ! దేదీ ప్యమాన! ప్రభాదివ్య గాత్రా! శివా! పాలితా! శేష బ్రహ్మాండ భాండోదరా! మేరు ధీరా! వికారూపా! వారాశి గంభీర! సౌజన్య రత్నాకరా!..." భయానకాశ్చర్య రసాలు మేళవిం చిన దండకం సాగిపోతూంటే అపర వీరభద్రుడై ఆబాల గోపాలాన్ని ఉర్రూత లూగించేవాడు. ఆ... దృశ్యాలింకా గంగమ్మ స్మృతి పథములో మెదుల్తూ స్ఫూర్తినిస్తుంటాయి.

అప్పుడప్పుడు అక్కాచెల్లెళ్ల మధ్య సవతి పోరు సరదా జరుగుతుండేది. పార్వతి మహిషాసుర మర్దినిలా కొంగు నడుముకు చుట్టుకుని ఒంటి కాలుమీద ఉరికొచ్చి శత్రు వులా.

"గంగమ్మ మెత్తనిదే కాని గట్టుకు గట్టు కోసేస్తుందే గంగీ!" అంటూ చేతులు తిప్పుతూ తిడుతుండేది.

"శివ శివా! పార్వతమ్మైతే తండ్రినే చంపించింది గదా! కని కరం లేని ఆడ జన్మ కఠిన శిల లాంటిది" అంటూ గంగమ్మ తిరగబడేది.

మర్నాడు అన్నీ మరిచి అక్కాచెల్లెళ్లై పోయేవారు.

ఇద్దరు పెళ్లాల ముద్దుల సంసార సాగరములో ఇలాంటి సరిగమలు మామూలే అనుకునేవాడు ఈశ్వరయ్య.

సంసార సాగర యానములో హాయిగా సాగిపోతున్న

